నేను పని చేస్తా.. చేయిస్తా..!

● సమస్యలు తెలుసుకునేందుకే ఆకస్మిక తనిఖీలు ● ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్



జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్.

ఇంటర్వ్యూ

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'నేను పని చేస్తేనే.. నా పరిధిలో ఉన్న అధికార యంత్రాంగం అంతా పని చేస్తుంది అని నమ్ముతా. నేను క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటేనే వాటి పరిష్కారానికి ఏం చేయాలో తెలుస్తుంది. అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించే ముందు ఆయా ప్రాంతాల్లో సమస్యలు, పరిష్కారం ఎప్పటిలోగా చూపగలం, అధికారుల నిర్లక్ష్యమా లేక నిధుల కొరతనా అనే విషయాలు తెలుసుకునేందుకే నేను జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నా' అని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి అపూర్వ్ చౌహాన్ తెలిపారు సమస్యల పరిష్కారానికి ఏం చేయాలో తెలుసుకునే పనిలో నిమగ్నమైనట్లు ఆయన వివరించారు. జడ్సీ 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలను పంచుకున్నారు.

తనిఖీల్లో మీకు ఎదురవుతున్న సమస్యలు ఏమిటి.

నేను కూకట్‌పల్లి జోన్‌కు వచ్చినప్పటి నుంచి రోజుకు ఓ వార్డు చొప్పున ప్రతీరోజు ఉదయం 5.30 గంటలకే ఫీల్డ్‌కు వెళ్తున్నా. ఇక ఉదయం 7 గంటలకు ఏదో ఒక వార్డులో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకుంటున్నా. నాతో పాటే శానిటరీ, ఇంజనీరింగ్, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలను నా దృష్టికి తెస్తున్నారు.

దోమల సమస్యలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జోన్ పరిధిలో 41 చెరులకు గాను 19 చెరువుల్లో గుర్రపుడెక్క తీయాల్సి ఉంది. కొన్నింటిలో పని ప్రారంభించాం. డెంగీ, మలేరియా బారినపడకుండా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాం. పరిసరాల పరిశుభ్రత విషయంలో శానిటేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశా.

కాలనీలు, బస్తీల్లో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

నేను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి మూసాపేట్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్లలో పర్యటించా. వర్షం నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించాం. జోన్ పరిధిలో 24 చోట్ల రోజుల తరబడి నీరు నిలబడుతోంది. 19 చోట్ల పరిష్కారం చూపగా మరో అయిదులో రెండు చోట్ల నేను అప్రూవల్ ఇచ్చా. మరో మూడింటి పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదించే పనిలో ఉన్నాం.

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలేమిటి.

దోమల వల్ల డెంగీ వ్యాప్తి చెందుతుందన్న విషయం తెలిసిందే. రోజుకు 100 కుటుంబాల డేటా సేకరించేలా ఇంటింటికీ సర్వే చేయిస్తున్నాం. ఇప్పటికే జోన్ పరిధిలో 30 డెంగీ కేసులు నమోదయ్యాయి. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తూ డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నా. బస్తీలు, కాలనీల్లో దోమల వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం.

ఉద్యోగుల నుంచి స్పందన ఎలా ఉంది?

నేను పని చేయాలి.. నాతో పాటు జోన్ పరిధిలో ఉన్న అధికారులు, సిబ్బంది చేత పని చేయించుకోవాలి. నేను సమస్యలపై ప్రశ్నించడం కంటే అవి పరిష్కారానికి నోచుకోకుండా ఉండటానికి గల కారణాలు చెప్పమని అడుగుతున్నా. దీంతో ఉద్యోగులు స్వేచ్ఛగా వారికి ఉన్న ఇబ్బందులను నాతో పంచుకుంటున్నారు. దీంతో ఉద్యోగుల కొరత అనేది నేను తీర్చేది కాదు.. నా దగ్గర ఉన్న సిబ్బందితో ఎలా పనిచేయించుకోవాలన్న దానిపైనే నేను ఫోకస్ పెట్టా.

మత్తుకు బానిసలైతే భవిష్యత్ అంధకారమే..



ప్రసంగిస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్

బాలానగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని బాలానగర్ డీసీపీ కే.సురేష్‌కుమార్ సూచించారు. యాంటి డ్రగ్స్‌పై బాలానగర్ నైపర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. యువత చేతిలోనే దేశ భవిష్యత్, కుటుంబపరువు ప్రతిష్ఠ ముడిపడి ఉందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే యువత నిర్వీర్యం కాక తప్పదని హెచ్చరించారు. అడిషనల్ డీసీపీ పి.సత్యనారాయణ మాట్లాడుతూ.. మత్తుపదార్థాలకు బానిసలైన వారంతా విచక్షణ, మానవత్వం కోల్పోయి నీచకృత్యాలకు పాల్పడుతూ ఊచలు లెక్కిస్తున్నారని వివరించారు. ఏసీపీ హనుమంతరావు మాట్లాడుతూ.. మత్తుపదార్థాలు ప్రాణాంతకంగా మారుతాయని హెచ్చరించారు. బాలానగర్ సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నైపర్ రిజిస్ట్రార్ ఆస్థానా, బాలానగర్ ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయాల్లో శాకాంబరీ పూజలు




శాకాంబరి అవతారంతో పోచమ్మతల్లి

భెల్‌కాలనీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం.. శుక్రవారం అమ్మవారి ఆలయాల్లో విశేషపూజలు జరుగుతున్నాయి. భెల్ టౌన్‌షిప్‌లోని పెద్దమ్మ తల్లి, కనకదుర్గాదేవి ఆలయం, ఎంఐజీకాలనీలోని పోచమ్మతల్లి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు మోహన్ గౌడ్ దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించగా పోచమ్మతల్లిని శాకాంబరీ అవతారంతో అలంకరించి పూజలు చేశారు. వివిధ రకాల కూరగాయలు, పళ్లతో అమ్మవారిని అలంకరించి ఉత్సవాలు నిర్వహించారు.

భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో..

హైదర్‌నగర్: కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో శాకాంబరిదేవి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో మహాప్రసాదం తయారుచేసి శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

సాయిబాబా ఆలయంలో పౌర్ణమి వేడుకలు



పుష్పాలంకరణలో సాయిబాబా

భెల్‌కాలనీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్, ఎంఐజీకాలనీలోని సాయిబాబా మందిరాల్లో వేడుకలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. భెల్ టౌన్‌షిప్‌లోని గురుసాయి మందిరంలో వార్షికోత్సవం, గురుపౌర్ణమి మహోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు చేశారు. సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి విశేష అభిషేకం, కుంకుమార్చనల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● నేటి నుంచి సాయినాగేంద్ర ఆలయంలో..

బాలానగర్: డివిజన్ పరిధి సాయినగర్ సాయినాగేంద్ర ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కమిటీ చైర్మన్ అంబటి సునిల్ కుమార్‌గుప్తా, జనరల్ సెక్రటరీ వి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

● 21న సాయిదత్త గణపతి ఆలయంలో..

రాయదుర్గం: గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో ఈనెల 21న గురుపూర్ణిమ పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఖాళీస్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్, రామారావు, బస్తీవాసులు

ఆలయ నిర్మాణం కోసం ఐలా స్థలాన్ని కేటాయించండి

ఫతేనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ జింకలవాడ శివానగర్ బస్తీకి పక్కనే ఉన్న ఐలా ఖాళీ స్థలంలోని కొంత భాగం ఆలయ నిర్మాణం కోసం కేటాయించాలని డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ఐలా ఇన్‌చార్జి రామారావును శుక్రవారం కోరారు. ఈ సందర్భం గా సతీష్‌గౌడ్, రామారావులు ఆ స్థలంలో పర్యటించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ సతీష్‌గౌడ్, ఐలా ఇన్‌చార్జి రామారావును పిలించి బస్తీవాసుల సమక్షంలో చర్చించారు. దీనిపై స్పందించిన రామారావు ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కార్పొరేటర్‌కు, బస్తీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఎర్ర నర్సయ్య, కొమురయ్య, రవి, నవీన్, పాండూనాయక్, వీరేశ్‌గుప్తా పాల్గొన్నారు.

కేఎల్ వర్సిటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేష్

గాజులరామారం, జూలై 19(ఆంధ్రజ్యోతి): భూ కబ్జాదారుల ఆగడాలకు అడ్డూ, అదుపు లేకుండా పోయిందని పేదల భూములను కబ్జాదారులు గుంజుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్ సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో లాల్‌సాబ్‌గూడకు చెందిన పద్మావతితో కలిసి ఆయన మాట్లాడారు. లాల్‌సాబ్‌గూడ సర్వేనెంబర్లు 344/1, 335/1ల్లో ధారా పద్మావతి తన భూమిలోకి వెళ్తుంటే కేఎల్ వర్సిటీ సెక్యూరిటీ సూపర్ వైజర్, సిబ్బంది రానివ్వడం లేదని, ఈ విషయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేఎల్ వర్సిటీ సిబ్బంది తమ కుమారుడు నర్సింగరావుపై దాడి చేశారన్నారు. దాడి విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పద్మావతి తెలిపారు. ఈ సమావేశంలో స్వామి, హరినాథ్, సదానంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శంకరమఠంలో శ్రీమద్భగవద్గీత శిక్షణ

అల్లాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్‌లోని శారదా శంకరమఠంలో ఈనెల 22 నుంచి శ్రీమద్భగవద్గీత శిక్షణా తరగతులుంటాయని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు రోజూ ఓ గంట సేపు శిక్షణ ఉంటుందని, బ్రహ్మశ్రీ వడ్లమాని సూర్యనారాయణ శర్మ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి గలవారంతా శిక్షణ పొందవచ్చని శంకరమఠం ప్రతినిధులు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గచ్చిబౌలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులుగా సీజనల్ వ్యాధులు, డెంగ్యీ ఫీవర్‌తో బాధపడుతున్న వారి గురించి తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్వహించిన సర్వేలో సుమారు 75 మంది ఆశా వర్కర్లు పాల్గొంటున్నారు. ప్రతి ఒక్కరూ రోజులో 130 మంది ఇంటికి వెళ్లి సర్వే చేయాల్సి ఉంటుంది. ఆదిశగా రోజుకు 2,190 మందిని కలిసి వివరాలు సేకరిస్తున్నారు. మూడు రోజుల్లో నిర్వహించిన సర్వేలో సుమారు 6,570 మందిని సర్వే చేయ్యగా సుమారు 24 మంది డెంగ్యూ ఫీవర్, 800 మంది చలిజ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. సుమారు 1200 మంది సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని సహాయ వైద్యాధికారి స్వామి తెలిపారు.

అమ్మ మాట.. అగన్వాడీ బాట

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి 19వ డివిజన్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మేయర్ కొలన్ నీలారెడ్డి పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. మేయర్ మాట్లాడుతూ.. చదువు, ఆరోగ్యంతో పాటు పిల్లల మానసిక ఉల్లాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు.



చెరువులను పరిశీలిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

చెరువులు, కుంటల్లో మురుగునీరు కలవకుండా చర్యలు

గచ్చిబౌలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చెరువులు, కుంటల్లోకి మురుగునీరు కలవకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిల్ పరిధిలోని అధికారులతో కలిసి పటేల్‌చెరువు, గంగారం పెద్దచెరువు, ఖాజాగూడ చెరువు, గచ్చిబౌలి చెరువు, నల్లగండ్ల పెద్దచెరువును పరిశీలించారు. ఈ చెరువులోకి వివిధ ప్రాంతాల్లోని మురుగునీరు నేరుగా చేరుతుందని తెలిపారు. చెరువుల్లో మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్రమైన నిర్మాణాలను చేపట్టాలని, క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేయాలన్నారు. చెరువులు, కుంటల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలని, దోమల వ్యాప్తికి ఆవాసాలుగా చెరువులు, కుంటలు మారకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు వ్యర్థాలు చెరువుల్లో వేయొద్దని సూచించారు. అదేవిధంగా చెరువు స్థలాలు కబ్జాలకు కాకుండా నోడల్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ లేక్స్ శివకుమార్‌నాయుడు, డీసీలు వంశీకృష్ణ, రజనీకాంత్‌రెడ్డి, ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగం, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు గృహకల్ప ఇళ్లు అందించాలి: సీపీఎం



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నిజాంపేట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప ఇళ్ల దురాక్రమణను అరికట్టి నిజమైన లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఎం నాయకులు చంద్రశేఖర్, బాలాపీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాచుపల్లి మండలం నిజాంపేట్ పరిధిలోని గృహకల్ప ఇళ్లను నిజమైన లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఎం నాయకులు బాచుపల్లి డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2005లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని జీఓ 1908ను విడుదల చేసిందన్నారు. ఈ క్రమంలో నిజాంపేట్ ప్రాంతంలో 103 బ్లాకులు నిర్మాణం చేసి, 3,296 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారన్నారు. లబ్ధిదారుల్లో 45 మందికి వివిధ కారణాలు వలన కేటాయింపు జరగలేదని, ఖాళీగా ఉన్న ఇండ్లలో అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలతో అక్రమంగా నివాసం ఉంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం సమగ్ర సర్వే చేయించి నిజమైన లబ్ధిదారులకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లమ్మ, పెంటమ్మ, కిషన్, యాదగిరి, నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప సీపీఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణపై అగాహన ర్యాలీ



అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, అధికారులు

హైదర్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్ కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో డ్రై డే డ్రై డే కార్యక్రమంలో ఎంటమాలజీ ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొని ఎంటమాలజీ పీఏ ఇంద్రసేన, సీఏ ముస్తఫా, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు కలిసి ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ఎల్లమ్మ చెరువు వద్ద పైపులైను పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ డివిజన్ ఇండియన్ బ్యాంక్ నుంచి ఎల్లమ్మ చెరువు సర్‌ప్లస్ నాలా వరకు రూ.2 కోట్లతో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, డీఈ రమేష్, ఈఈ గోవర్దన్, ఎస్ఈ చెన్నారెడ్డి, ఏఈ శ్రావణి పరిశీలించారు.

ప్రజలు భాగస్వాములు కావాలి

ఓల్డుబోయినపల్లి: ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి సర్కిల్ ఎంటమాలజీ సిబ్బంది ఓల్డుబోయినపల్లి డివిజన్ ప్రజలకు సూచించారు. జీహెచ్ఎంసీ, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్లు, ఉపకమిషనర్ కృష్ణయ్య సూచనల మేరకు ఎంటమాలజిస్ట్ సంధ్య, ఎంటమాలజీ సూపర్‌వైజర్ స్వామి ఆధ్వర్యంలో స్వయంసహాయక సంఘాలు, ఆర్పీలతో కలిసి శుక్రవారం డివిజన్ పరిధిలోని యాదవబస్తీ, కుమ్మరిబస్తీలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో ఆర్పీలు దుర్గ, లక్ష్మీ, రాజకుమారీ, అరుణ, గుణసుందరి, సునీత, ఏఎన్ఎం పద్మ, ఆశా వర్కర్లు విజయలక్ష్మీ, కవిత, జ్యోతి, శ్వేత శ్రీలత, ఈశ్వరమ్మ, దుర్గ, సౌజన్య అరుణ, తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్‌లకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

పెట్టుబడులపై ఔత్సాహికులకు జేఎన్‌టీయూలో అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఔత్సాహికులు

హైదరాబాద్‌సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ఆసక్తి చూపుతున్నాయని జేఎన్‌టీయూ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. గోల్డెన్ జూబ్లీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ), అఖిల భారత ఉన్నత విద్యామండలి (ఏఐసీటీఈ) పలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్టార్టప్ ఫండింగ్ అవకాశాలపై ఔత్సాహికులకు.. అలీఫ్ సంస్థ సీఈవో డాక్టర్ జాహిర్ ఉల్లా, టీహబ్ ఇంక్యుబేషన్ మేనేజర్ గౌరవ్‌గుప్తా, ఎస్‌బీఐ ఉన్నతాధికారులు అవగాహన కల్పించారు.

మెస్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని ఓ మెస్‌లో శుక్రవారం రాత్రి స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాత్రి 8:10 నిమిషాల సమయంలో కిచెన్‌లో ఆయిల్ వేడెక్కడంతో చిమ్నీలకు తగిలి మంటలు చెలరేగాయి. వేడికి వైర్లు కాలిపోవడంతో పొగ వాసనతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అగ్నిప్రమాదం జరిగిన హర్ష మెసును కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించి తక్షణమే మెస్‌ను మూసి వేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించాక తెరవాలని నిర్వాహకులకు సూచించారు. అగ్నిప్రమాదం కారణంగా బ్లోయర్లు కాలిపోయాయని, సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని మెస్ నిర్వాహకులు కార్పొరేటర్‌కు తెలిపారు. అగ్నిమాపక దళం వచ్చేసరికి మెస్‌లోని ఫైర్ సేఫ్టీ సిలిండర్లతో మంటలను అదుపుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జనావాస ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరగడంతో విషయం తెలుసుకున్న స్థానిక, పరిసర ప్రాంతాల జనం పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

జేఎన్‌టీయూ

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు షురూ

● 21, 22 తేదీల్లో నాలుగు సెషన్లలో నిర్వహణ

హైదరాబాద్ సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలను ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 23న నోటిఫికేషన్ విడుదల కాగా, మొత్తం 1,031 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 975 మంది పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోసం దరఖాస్తు చేసుకోగా, ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్‌లు 42 మంది, ఫుల్‌టైమ్ పీహెచ్‌డీ కోసం 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సబ్జెక్టుల వారీగా పరిశీలిస్తే.. అత్యధికంగా కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసేందుకు 486 మంది దరఖాస్తు చేసుకోవడం విశేషం. ప్రవేశ పరీక్షలను రెండ్రోజుల పాటు మొత్తం 4 సెషన్లలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వర్సిటీ రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ డీ డైరెక్టర్ వి.కామాక్షిప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఎ.అరుణకుమారి తదితరులు పర్యవేక్షించారు. కాగా, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ప్రవేశ పరీక్షకు అర్హులైన వారి జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. జాబితాలో పేర్లున్న అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను ఒకరోజు ముందుగా అడ్మిషన్ విభాగం నుంచి పొందవచ్చని ఇన్‌చార్జి డైరెక్టర్ జి.కృష్ణమోహరావు సూచించారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాగిరెడ్డి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఫతేనగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధి మరే పార్టీకి లేదని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి అన్నారు. రైతురుణ మాఫీ అమలు చేసిన సందర్భంగా శుక్రవారం భరత్ నగర్ పార్కులో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అశోక్‌ముదిరాజ్, పాండుముదిరాజ్, బుచ్చిబాబు, రమేష్, కృష్ణయ్య, నాయుడు, సత్యనారాయణ, భాను, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండించండి: యూఎస్ఎఫ్ఐ

షాపూర్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో అక్రమ అరెస్టులను ఖండించాలని, అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలలోతు రాజేష్‌నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.చంద్రకాంత్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లో చంద్రకాంత్ మాట్లాడుతూ ఇతర విద్యార్థి సంఘ నాయకుల యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి కార్యక్రమాలకు పిలుపునిచ్చినప్పటికి పోలీసులు అత్యుత్సాహంతో అరెస్టు చేయడం పరిపాటిగా మారిందన్నారు. అర్ధరాత్రి ఇండ్లలోకి వెళ్లడం సరియైనది కాదని, పోలీసులు వారి వైఖరి మార్చుకోవాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు జేవీకాలనీ, ప్రశాంతిహిల్స్, రాయదుర్గం, 11.30 నుంచి 12 గంటల వరకు ఏపీహెచ్‌బీకాలనీ, జయభేరిఎన్‌క్లేవ్, రాయదుర్గం, మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు టీఎన్‌జీవో ఫేజ్-1, 2, గోల్ఫ్‌వ్యూ అపార్టుమెంట్‌లో, 12.30 నుంచి 1 గంట వరకు ఓల్డ్‌గచ్చిబౌలి, జర్నలిస్టుకాలనీ, 1 గంట నుంచి 1.30 గంటల వరకు పద్మశ్రీగార్డెన్, గౌలిదొడ్డి, టింబర్‌లేక్, ఏపీహెచ్‌బీ కాలనీలో విద్యుత్ ఉండదన్నారు.

సెల్‌ఫోన్ దొంగను పట్టుకున్న పెలికాన్ వలంటీర్



శివకుమార్‌కు నగదు అందిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్

జీడిమెట్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): సూరారం బస్టాప్‌లో ప్రయాణికుడు బస్సు ఎక్కుతుండగా ఓ దొంగ తన చేతివాటం ప్రదర్శించి సెల్‌ఫోన్ కొట్టేశాడు. ఈ విషయాన్ని గమనించి తోటి ప్రయాణికుడు బాధితుడికి సమాచారం అందించగా దొంగ బస్సులోంచి దూకి పారిపోతున్నాడు. ఈ క్రమంలో జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సూరారం సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న పెలికాన్ వలంటీర్ శివకుమార్‌యాదవ్ దొంగను వెంబడించి పట్టుకున్నాడు. సెల్‌ఫోన్ విషయం ఆరా తీయగా బస్సులోనే మరొకరికి ఇచ్చినట్లు చెప్పాడు. దొంగను సూరారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దొంగను పట్టుకున్న శివకుమార్‌కు జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ వెయ్యి రూపాయల నగదును ఇచ్చి అభినందించారు.

వరద నీటి సమస్య తలెత్తితే సమాచారం ఇవ్వండి

బాలానగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా బాలానగర్ డివిజన్‌లో వరద నీటి సమస్య తలెత్తితే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. రెండు రోజుగా కురిసిన వర్షాల కారణంగా పంచవటి అపార్టుమెంట్ సెల్లార్‌లోకి నాలా నీరు నిండి అపార్టుమెంట్ వాసులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న ఆయన అధికారులను, జీహెచ్ఎంసీ సిబ్బందిని పిలిపించి సెల్లార్‌లో నిలిచిన మోటార్ల సాయంతో తొలగించారు.

సివరేజీ సమస్యలను పరిష్కరించాలి

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శుక్రవారం ఐదో ఫేజ్‌లో పర్యటించారు. అక్కడ జరుగుతున్న మంజీర, సివరేజీ పైపులైను పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారును కోరారు. ఈ కార్యక్రమంలో హనుమంతురావు, ఏఈ. సాయిప్రసాద్, జలమండలి మేనేజర్ శ్రీకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

షాపూర్‌నగర్ పీహెచ్‌సీయూలో వ్యాక్సిన్ క్యాంపెయిన్

షాపూర్‌నగర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజనల్లో వ్యాధుల నివారణకు జపనిస్ ఎన్ సెఫలైటిస్ (మెదడువాపు) వ్యాక్సిన్ వేసే విధంగా ఈనెల 25 నుంచి క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు షాపూర్‌నగర్ పీహెచ్‌సీయూ ఇన్‌చార్జి డాక్టర్ నవనీత శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా షాపూర్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, గవర్నమెంట్ స్కూల్ ప్రిన్సిపల్, ఆశావర్కర్లుకు పీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ నవనీత ఆధ్వర్యంలో ట్రైనింగ్ ఏర్పాటు చేశారు.

స్కూళ్లలో సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

హైదర్‌నగర్, జూలై19(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గం విద్యా కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆయన నివాసంలో కలిసి ప్రభుత్వ స్కూల్, కాలేజీలో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయదుర్గంలోని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కాలేజీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి గాంధీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. విద్యాకమిటీ సభ్యులు కృష్ణగౌడ్, నరేందర్ ముదిరాజ్, సురేష్, ప్రభాకర్, సుదర్శన్ పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా శుక్రవారం ఆయన నివాసంలో శేరిలింగంపల్లి క్రిస్టియన్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.